# షాలిమర్

మా లాడ్జిలో వాళ్ళందరూ, అవాళ నన్ను చూసి నా వాలకం, వేషంచూసి, షాక్ అయినారు: అనగా విస్మయాంబుధిలో మునిగి పోయినారు.

మా లాడ్జిలో నేను మినహా మిగతా సదస్యులందరూ, ఓ కాలేజీలో చదువుకునే విద్యార్థులు. అనుభవం కరుకు తేలినవాళ్ళు.

సంజెవేళ యెండ యింకా ఒకటో రెండో పొరలు ఉండగానే, ఒక్కొక్కడూ దిద్ది తీర్చుకుని షికారు బయలు దేరుతారు. అందరూ ఎప్పుడూ మల్లెపూలులాగా ఉంటారు, కట్టూ, జుట్టూ మాయకుండా, రేగకుండా.

అందరిలోకీ ఏబ్రాసిని నేను ఒక్కడినే. తల ఎప్పుడూ దుబ్బేసుకు పోయినట్లు ఉంటుంది. చొక్కాకు గుండీలు ఉండవు. పంచనిండా లుంగీనిండా, కాఫీ – టీల మరకలు, గరగరలాడే గడ్డం, నిదురకు ఎన్నడూ నోచుకోని కళ్లు, నా గాలి సోకగానే ఇస్త్రీ మడతలు మాసిపోతాయి.

ఇలా మసిపాతలాగ ఉన్నా, కథలు వ్రాస్తాననే భయం కొద్దీ, నా జోలికి ఎవడూ వచ్చేవాడుకాడు; వీలైనంత వరకూ గౌరవంగానే చూడటానికి ప్రయత్నించేవాడు, ప్రతివాడూను, వీడిని ఏమంటే ఏం మునుగుతుందో అని:

సరే, ఇన్నివిధాల సర్వ – రోతగానూ వుంటూన్నవాడి నల్లా, ఉన్నవాడిని వున్నట్టు ఊరుకోక, అమాంతం ఒక మంచి ముహూర్తాన తల చక్కగా క్రాప్ చేయించి, అల్లారు ముద్దుగా దువ్వి, మొగానికి మెరుగురాచి, జాజిరేకలలాటి దుస్తులు పొంకంగా ధరించి, కలకలలాడుతూ ప్రత్యక్షమైతే వాళ్ళందరిలోనూ సంచారీ – వ్యభిచారీ భావములు ఎన్ని రీతులుగా చెలరేగినవో, నేను ఊహించేందుకైనా తంటాలు పడలేదు:

కొందరు – సందేహించారు: కొందరు భయపడ్డారు: కొందరు నవ్వేందుకు సందుదొరికింది కదా అని సంబరపడ్డారు: మొత్తానికి అందరి మనసుల్లోనూ స్థాయి కలకబారింది:

వీడి వాలకం ఏమిటో ఎవడికీ అంతు చిక్కటం లేదు: ఎవడికి వాడు, దొంగచాటుగా, నా కళ్ళవంక చూస్తున్నాడు; చూపుల్లోనైనా వేపకాయంత వెర్రి బయట పడుతుందేమోనని: అమావాస్య రేపో ఎల్లుండోననగా నన్ను తప్పుకు –తప్పుకు తిరిగారు, ఎక్కడ మీదబడి కరుస్తానో అని:

నేను ఒక్కడినీ కరవలేదు: బిగ్గరగా ఏనాడూ అరవనన్నా లేదు, వెర్రొ మొర్రొ నాలో నేను కూనిరాగం తీస్తూండటమే కాని:

ఇదమిత్థమని తెల్సుకోలేని స్థితిలో రోజులు గడుస్తూండటం, నేను ఎప్పుడూ యెదుట మెలగుతూండటం, నాగది అంతా అత్తరూ - పన్నీరూ - మయమైపోతూండటం, ఆనాటి కానాడు నేను మరీ, బాలా - కుమారుణ్ణయి పోతూండటం; ఇలా అయితే వాళ్ళ ఆరోగ్యానికి భంగకారి అని గట్టిగా తోచి వుండవచ్చును - ఉండవచ్చు నేమిటి తోచింది:

అందుచేత అవాళ ఆదివారంకదా, అందరూ వేళకు అక్కడేవుండి నన్ను పరివేష్టించి అందరిలోనూ రవంత తెంపరితనం వున్న ఒకడిచేత అడిగించారు, భాయీ, నీకు వచ్చిన ఆపద ఏమిటిరా? అని:

నేను ఆశ్చర్యం, అమాయికత్వం అభినయించాను: “ఏం లేదే” అంటూ నసిగాను:

కాదు, సంగతేమిటో చెప్పమని, కాదు - కూడదని, మెడలు విరిచారు: తాము, మనసులో ఇన్నాళ్ళనుంచీ పడుతున్న గుంజాటన యావత్తూ చిలువలు-పలువలుగా వివరించారు:

ఇహ, చెప్పక తప్పింది కాదు:

ఈ సంగతి పాలాక్షుడికి తెలియకూడదు. తెలిస్తే కొంపలు అంటుకుపోతాయి. ఖూనీలు జరుగుతాయి. విప్లవం విజృంభించి, దేశం అరాచకమైపోతుంది అని నాభయం. ఎవరితో చెప్పమని ఏన్నో ఒట్లూ ప్రమాణాలు చేశారు: ఇక అంతటికీ నాకు అనుగ్రహం రాకపోతే ప్రయోపవేశం చేస్తామన్నారు:

అప్పుడు బయట పెట్టాను: నేను ఫలానా అమ్మాయిని ప్రేమిస్తూన్నానని, ఆ ప్రేమలో మునిగి తేలుతున్నానని:

ఆ అమ్మాయి భోగట్టా, మీకు కొంత చెప్పకపోతే వాళ్ళందరూ ఆ సువార్త వినేటప్పటికల్లా ఏమైనారో ఊహించేందుకు వీలుండదు:

అమ్మాయి అంటే అమ్మాయికాదు. కుందనపు బొమ్మోయి! వాళ్లనాన్నకు ఒక్కతే కూతురు: వాళ్ళనాన్న ఏభైలక్షలకు ఒక్కడే కొడుకు:

నమ్మకుండా వుందామని, మనసులో ప్రతివాడూ ఎంతో తపించాడు. ఇది శుద్ధ అబద్ధమూ, వట్టి బుకాయింపూ అయేట్లు ప్రసాదించమని, ఎవడి కులదైవానికి వాడు మనసులో కోటి ముక్కులు మొక్కుకున్నాడు:

అందరూ అసూయతో హతమారి పోతున్నారు. మనమీద, అత్తరువులు ఆనాటి కానాడు ఘుమాయించి పోతూన్నవి.

ఇలా ఒక మాసం గడిచింది: వ...పై ఒకటో నాటి నుంచీ మళ్ళా, అలుగ్గడ్డగా తయారైనాను: అందరి కళ్ళూ ఒక్కతూరు చల్లబడ్డవి:

నెలాళ్ళు నిదానించి చూశాను: వీళ్ళలో ఒక్కడికన్నా, బుద్ధి ఉన్నదేమోనని, ఏంరా నిన్ను ఆ అమ్మాయి ప్రేమిస్తూన్నదా? అని అడుగుతాడేమోనని, ఉహుఁ...

అలా అడిగినట్టయితే నేనే సత్యసంధుణ్ణయితే ఏమని జవాబు చెప్పేవాడిని? ఆ అమ్మాయికి అసలు నా ముక్కూ మొగమూ తెలియదురా బాబూ, భూభారంలో కొన్ని పౌనుల తూకానికి యీ వ్యక్తి బాధ్యుడని కూడా ఆ కుర్రది కల గని

వుండదు: మీ లాగానే నేను ఎన్నడన్నా ఆ అమ్మాయిని పై అంతస్థులో నిలుచుని వుండగా చూడటమే: మీ అంత పరకాయించి కూడా చూసిన పాపాన పోలేదు.

కాని, వాళ్ళు ఏమనుకున్నారు? నా ప్రణయం భగ్నమైపోయిందనీ, అందువల్ల నా తల విషాదంలోకి రేగి పోతూన్నదనీ. ఏమన్నా అనుకోనీ, నా జుట్టుమళ్ళా హాయిగా దుబ్బేసుకు పోతూంది:

లాడ్జిలో తతిమ్మా గదుల్లో సుగంధ ద్రవ్యాలు చెలరేగుతూన్నవి: ఆ మేడ ముందర రోడ్డు మా వాళ్ళ కాళ్ళ క్రింద పడి గుంటలు పడిపోతూన్నది: యెవడికి వాడు ప్రస్తుతం ఖాళీగా, రికామీగా వున్నా ఆ కటాక్షం తమమీద పడితే బాగుండునని కాళ్ళు బలపాలు కట్టేటట్టు తిరుగుతున్నారు: ఎవడికి వాడికే అద్దంలో నవమన్మధుడులా కనబడుతున్నాడు:

అలా తిరగనీయండి, తిరక్క మొగాడు చెడ్డాడని: కాళ్ళలో సత్తువ వున్నన్నాళ్ళూ తిరుగుతారు. తిరగనీయండి: ఎలాగూ వేసంగి రానే వస్తూంది.

★ ★ ★